

నోరు లేని మేకల్నే బలి ఇస్తారు.
సింహాల్ని బలివ్వరు, గుర్తించుకోండి.
- డా. బిఆర్ అంబేద్కర్

REGD NO : APTEL 16144

# జనస్వరం

పవర్

అక్షరమే ఆయుధం ✍

www.Janaswaram.com

జనస్వరం న్యూస్ తెలుగు వారపత్రిక ద్వారా తక్కువ ఖర్చుతో పుట్టినరోజు శుభాకాంక్షలతో పాటు అన్నీ కార్యక్రమాలకు ప్రకటనలకు సంప్రదించండి.
మా మెయిల్ ఐడి : janaswaramnews@gmail.com
మొబైల్ నెంబర్ : 9642067900

సంపుటి : 4 | సంచిక : 285 | ఎడిటర్ : నరేష్ సాకే | వార సంచిక : 29 - 04 - 2025 | పేజీలు : 5


## ఉద్యోగంతోనే సంతృప్తి చెందొద్దు... సంస్థలను స్థాపించే స్థాయికి ఎదగండి : సీఎం చంద్రబాబు

**- అమరావతి విట్ వర్సిటీ 'వి లాంచ్‌పాడ్ 2025'లో సీఎం చంద్రబాబు**
**- యువత ఉద్యోగాలు ఇవ్వాలి, సంస్థలు స్థాపించాలి: సీఎం**
**- విట్ అధినేత విశ్వనాథన్‌ను, వర్సిటీ విజయాలను ప్రశంసించిన సీఎం**

**అమరావతి, ఏప్రిల్ 28, జనస్వరం :** దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, వారు ఉద్యోగాలు పొందే స్థాయిలోనే ఆగిపోకుండా, ఇతరులకు ఉద్యోగాలు కల్పించే సంస్థల స్థాపకులుగా ఎదగాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. ప్రభుత్వం కల్పించే అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలకు చేరాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. అమరావతిలోని విట్ (VIT-AP) యూనివర్సిటీలో జరిగిన 'వి లాంచ్‌పాడ్ 2025 - స్టార్టప్ ఎక్స్ పో' కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన, క్యాంపస్‌లో నూతనంగా నిర్మించిన మహాత్మాగాంధీ, వి.వి. గిరి, దుర్గాబాయి దేశ్‌ముఖ్ బ్లాక్‌లను ప్రారంభించారు.ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి సీఎం చంద్రబాబు ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్‌ను ఒక ఇన్నోవేషన్ వ్యాలీగా తీర్చిదిద్దుతున్నామని, అమరావతి క్వాంటమ్ వ్యాలీకి కేంద్రంగా మారనుందని స్పష్టం చేశారు. ఎంతో కీలకమైన రాజధాని నిర్మాణ పనులు మే 2వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా పునఃప్రారంభం కానున్నాయని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వెల్లడించారు. విట్ అధినేత జి. విశ్వనాథన్‌తో తనకున్న అనుబంధాన్ని చంద్రబాబు గుర్తుచేసుకున్నారు. సాధారణ వ్యక్తిగా జీవితాన్ని ప్రారంభించి, రాజకీయాల్లో (పార్లమెంటు సభ్యునిగా), విద్యా రంగంలో అసాధారణ విజయాలు సాధించారంటూ విశ్వనాథన్‌ను ఆయన అభినందించారు. 2014 ఎన్నికల ఫలితాలు రాకముందే విశ్వనాథన్ తనను కలిసి అమరావతిలో విట్ ఏర్పాటుకు అనుమతి కోరారని, తాను వెంటనే 100 ఎకరాలు కేటాయించానని తెలిపారు. భవిష్యత్తులో అవసరమైతే మరిన్ని భూములు ఇచ్చే బాధ్యత తనదని హామీ ఇచ్చారు. రాబోయే ఏడేళ్లలో విట్ అమరావతిలో విద్యార్థుల సంఖ్య 50 వేలకు చేరాలని ఆకాంక్షించారు. విట్ అమరావతిలో 95 శాతం ప్లేస్‌మెంట్స్ ఉండటం, ప్రపంచంలోని మేటి 100 విశ్వవిద్యాలయాల్లో విట్‌కు స్థానం దక్కడం గర్వకారణమని చంద్రబాబు కొనియాడారు. విట్ విద్యాసంస్థలన్నింటిలో అమరావతి క్యాంపస్ అగ్రస్థానంలో నిలవాలని తాను కోరుకుంటున్నట్లు ముఖ్యమంత్రి పేర్కొన్నారు. యువత నైపుణ్యాలను పెంపొందించుకుని, సృజనాత్మక ఆవిష్కరణలతో ముందుకు సాగాలని ఆయన సూచించారు.

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి అభివృద్ధికి ఎలాంటి ఢోకా లేదని, త్వరలోనే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా రాజధాని నిర్మాణ పనులు పునఃప్రారంభమవుతాయని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఇక అమరావతి అన్‌స్టాపబుల్ అన్నారు. తాను మాటలు చెప్పే వ్యక్తిని కాదని, ప్రజలకు మేలు చేసి చూపిస్తానని పేర్కొన్నారు. తనపై అపారమైన నమ్మకంతో 29 వేల మంది రైతులు దాదాపు 34 వేల ఎకరాల భూమిని రాజధాని నిర్మాణం కోసం స్వచ్ఛందంగా ఇచ్చారని ముఖ్యమంత్రి గుర్తు చేసుకున్నారు. రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములయ్యేందుకు రైతులు ముందుకు రావడం



ప్రశంసనీయమని కొనియాడారు. దివంగత ప్రధాని, తెలుగు బిడ్డ పీవీ నరసింహారావు 1991లో ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలను తాను అందిపుచ్చుకుని, భవిష్యత్తు ఐటీ రంగంలోనే ఉందని ముందుగానే గుర్తించి, దానికి అధిక ప్రాధాన్యత ఇచ్చానని చంద్రబాబు తెలిపారు. ఆ దూరదృష్టితోనే హైదరాబాద్‌లో కేవలం 14 నెలల్లో హైటెక్ సిటీని నిర్మించామని ఆయన వివరించారు. ప్రస్తుతం తమ దృష్టి అంతా అమరావతిపైనే కేంద్రీకృతమైందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. త్వరలోనే అమరావతిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేయనున్నట్లు కీలక ప్రకటన చేశారు. అంతేకాకుండా, అమెరికాలోని సిలికాన్ వ్యాలీకి దీటుగా ఇక్కడ 'క్వాంటమ్ వ్యాలీ' ఏర్పాటుకు కూడా పునాది వేస్తున్నామని వెల్లడించారు. "ఒకప్పుడు నేను ఐటీ గురించి మాట్లాడితే కొందరికి అర్థం కాలేదు. ఇప్పుడు క్వాంటమ్ కంప్యూటింగ్ గురించి ప్రస్తావిస్తే, అదేమిటని కొందరు అడుగుతున్నారు" అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్త (ఎంట్రప్రెన్యూర్) తయారు కావాలన్నదే తన ఆకాంక్ష అని ఆయన తెలిపారు.

## హామీ నిలబెట్టుకున్నాం - పవన్ కళ్యాణ్



**మంగళగిరి, ఏప్రిల్ 28, జనస్వరం :** ఆంధ్రప్రదేశ్ లోని మత్స్యకారులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. సముద్రంలో చేపల వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు అందించే ఆర్థిక భృతిని రెట్టింపు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయం పట్ల రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామని ఆయన పేర్కొన్నారు. ఇటీవల శ్రీకాకుళం జిల్లా పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. గతంలో వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు రూ. 10,000 భృతిగా అందేది. తాజాగా కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఈ మొత్తాన్ని రూ. 20,000కు పెంచినట్లు పవన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల హామీని కార్యరూపం దాల్చేలా చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

"మత్స్యకారులకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం. వేట నిషేధ భృతిని రెట్టింపు చేస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం నెరవేర్చింది" అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. పెంచిన భృతి మొత్తాన్ని లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ పెంపుదల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1,29,178 మత్స్యకార కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుందని, ఇందుకోసం ప్రభుత్వం రూ. 259 కోట్లను కేటాయించిందని వెల్లడించారు. మత్స్యకారుల వలసలను తగ్గించి, స్థానికంగానే వారికి మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పవన్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ కు సుదీర్ఘమైన సముద్ర తీరం ఉందని, ఈ తీర ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం ద్వారా మత్స్యకార కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుందని తన ప్రకటనలో స్పష్టం చేశారు.

## పద్మభూషణ్ అవార్డును అందుకున్న బాలకృష్ణ

ప్రముఖ సినీ నటుడు, హిందూపురం టీడీపీ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ప్రతిష్ఠాత్మక పద్మ భూషణ్ పురస్కారాన్ని స్వీకరించారు. దేశ రాజధాని ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జరిగిన పౌర పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమంలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఆయన ఈ గౌరవాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమానికి బాలకృష్ణ సంప్రదాయ తెలుగు వస్త్రధారణ అయిన పంచెకట్టులో హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమానికి బాలకృష్ణతో పాటు ఆయన కుటుంబ సభ్యులు కూడా హాజరయ్యారు. భారతీయ సినిమా రంగానికి, సమాజానికి నందమూరి బాలకృష్ణ అందించిన విశిష్ట సేవలను గుర్తిస్తూ కేంద్ర ప్రభుత్వం ఆయనకు ఈ పద్మ భూషణ్ అవార్డును ప్రకటించిన విషయం విదితమే. నటుడిగా చిత్ర పరిశ్రమకు చేసిన సేవలతో పాటు, బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ ఛైర్మన్‌గా అందిస్తున్న సేవలను పరిగణనలోకి తీసుకుని ఆయనను ఈ పురస్కారానికి ఎంపిక చేశారు.

దివంగత ముఖ్యమంత్రి, ప్రముఖ నటుడు నందమూరి తారక రామారావు వారసుడిగా సినీ రంగంలోకి అడుగుపెట్టిన బాలకృష్ణ, తన సుదీర్ఘ కెరీర్‌లో వందకు పైగా చిత్రాలలో నటించి తెలుగు ప్రేక్షకుల గుండెల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. ఇప్పటికీ యువ కథానాయకులకు దీటుగా వరుస సినిమాల్లో నటిస్తూ తన ఉత్సాహాన్ని చాటుకుంటున్నారు. మాస్, యాక్షన్ చిత్రాలతో పాటు, పౌరాణిక, చారిత్రక, సాంఘిక పాత్రలలో కూడా తనదైన నటనతో మెప్పించారు. గతంలో కూడా ఆయన అనేక ఫిలింఫేర్, నంది అవార్డులతో సహా పలు పురస్కారాలు అందుకున్నారు.



## శ్రీవారి సేవలో కీలక సంస్కరణలు.. కొత్త రూల్స్ ఇవే!

**తిరుపతి, ఏప్రిల్ 28, జనస్వరం :** శ్రీవారి భక్తులకు సేవలు అందించే ప్రక్రియను మరింత మెరుగుపరిచే దిశగా తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కీలక సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా సీనియర్ సేవకులకు కొత్త హోదా కల్పించడంతో పాటు, పరకామణి సేవలో పాల్గొనేందుకు సాధారణ పురుష సేవకులకూ అవకాశం కల్పించింది. ఈ మార్పులతో పాటు, జూన్ నెలకు సంబంధించిన శ్రీవారి సేవా ఆన్‌లైన్ కోటాను ఏప్రిల్ 30వ తేదీన విడుదల చేయనున్నట్లు టీటీడీ ప్రకటించింది. తిరుమల, తిరుపతికి విచ్చేసే లక్షలాది భక్తులకు శ్రీవారి సేవకుల ద్వారా నాణ్యమైన సేవలు అందించాలనే లక్ష్యంతో, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనల మేరకు టీటీడీ ఉన్నతాధికారులు ఇటీవల పుట్టపర్తిలోని శ్రీ సత్యసాయి సేవా సంస్థ, కోయంబత్తూర్‌లోని ఇషా ఫౌండేషన్, బెంగళూరులోని ఆర్ట్ ఆఫ్ లివింగ్ వంటి ప్రముఖ సంస్థలను సందర్శించారు. అక్కడ సేవలందిస్తున్న విధానాలను అధ్యయనం చేసిన అనంతరం, శ్రీవారి సేవలో పలు సంస్కరణలను ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా తొలి దశ మార్పులను ఏప్రిల్ 30న విడుదల చేయనున్న నూతన అప్లికేషన్ ద్వారా అమలు చేయనున్నారు. భవిష్యత్తులో మరిన్ని మార్పులను దశలవారీగా తీసుకురానున్నట్లు టీటీడీ వర్గాలు తెలిపాయి. గత రెండేళ్లుగా వివిధ ప్రభుత్వ సంస్థల నుంచి పదవీ విరమణ పొంది, 45 నుంచి 70 ఏళ్ల మధ్య వయసున్న వారు 'సీనియర్ సేవకులు'గా సేవలు అందిస్తున్నారు. ఇకపై వీరిని 'గ్రూప్ లీడర్లు'గా వ్యవహరించనున్నారు. వీరు తమకు నచ్చిన విధంగా 15 రోజులు, ఒక నెల లేదా మూడు నెలల పాటు సేవ చేసేందుకు ఆన్‌లైన్‌లో ఆప్షన్ ఎంచుకునే వెసులుబాటు కల్పించారు. శ్రీవారి సేవకులను క్రమబద్ధీకరించడంలో ఈ గ్రూప్ లీడర్లు కీలక పాత్ర పోషించనున్నారు. తమకు కేటాయించిన విభాగాల్లో సేవకుల పనితీరును పర్యవేక్షించడం, వారి హాజరు నమోదు చేయడం, సేవకుల పనితీరును అత్యుత్తమం, బాగుంది, సాధారణం అని రేటింగ్ ఇవ్వడం వంటి బాధ్యతలను వీరు నిర్వహిస్తారు. శ్రీవారి హుండీ కానుకల లెక్కింపు ప్రక్రియ అయిన పరకామణి సేవలో పాల్గొనేందుకు ఇప్పటివరకు ప్రత్యేక కేటగిరీలు ఉండేవి. అయితే, ఇకపై కనీసం పదో తరగతి విద్యార్హత కలిగిన సాధారణ పురుష సేవకులు కూడా ఈ సేవలో పాల్గొనేందుకు టీటీడీ అవకాశం కల్పించింది. ఆసక్తి గల వారు ఆన్‌లైన్ ద్వారా పరకామణి సేవను బుక్ చేసుకోవచ్చు.



## జీవితం - వి "చిత్రం"




## ఈరోజు పంచాంగం వేళలు

**తేదీ : 29 ఏప్రిల్ 2025**
**తిథి : శుద్ధ విదియ ( మ : 2.01 వరకు )**
**నక్షత్రం : ధనిష్ట ( తె 5.52 వరకు )**
**బ్రహ్మముహూర్తం : తె 5.16 నుండి తె 6.01 వరకు**
**రాహుకాలం : ఉ 11.08 నుండి మ 12.33 వరకు**
**యమగండం : మ 3.24 నుండి సా 4.49 వరకు**
**వర్జ్య కాలం : మ 12.37 నుండి మ 2.17 వరకు**

## ఈరోజు నమాజ్ వేళలు

**తేదీ : 29 ఏప్రిల్ 2025**
**ఫజర్ : 5.35 ఉదయం**
**సూర్యోదయం : 6.48 ఉదయం**
**జొహర్ : 12.34 మధ్యాహ్నం**
**అసర్ : 3.52 సాయంత్రం**
**మఘ్రిబ్ : 6.19 సాయంత్రం**
**ఇష : 7.32 సాయంత్రం**


జనస్వరం
విలేకరులు కావలెను
"జనస్వరం" ఈ-దినపత్రిక (వెబ్ పత్రిక) నందు పని చేయుటకు
రెండు తెలుగు రాష్ట్రాల్లో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి విలేకరులు కావలెను..
అసక్తి ఉన్న వారు సంప్రదించండి..
సాయి కల్యాణ్
ఫోన్ నెం : 7013030690
మేనేజింగ్ డైరెక్టర్
జనస్వరం మీడియా



# ఎడిటోరియల్

# వైఎస్ జగన్ '2.0' ఇంకో డిజాస్టర్.!

అధికారం కోల్పోయాక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గడచిన పది నెలల్లో ఏం చేసింది.? ప్రజల తరఫున ఏమైనా ప్రజా ఉద్యమాల్లో కనిపించిందా.? ప్రభుత్వ వైఫల్యాల్ని ఎండగట్టిందా. ప్రతిపక్ష నేత.. అనే హోదా కావాలనుకుంటున్న వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, 'ఆ దిశగా' ప్రజల మెప్పు పొందగలుగుతున్నారా.? 'వైఎస్ జగన్ 2.0' చూడబోతున్నారంటూ వైసీపీ అధినాయకత్వం సంకేలాలు పంపడం, వైసీపీ శ్రేణులు, 'కూటమి కుప్ప కూలుతుంది.. మేమే అధికారంలోకి వస్తాం..' అని భ్రమల్లో బతికెయ్యడం చూస్తూనే ఉన్నాం. జమిలి ఎన్నికలొస్తాయ్.. రెండేళ్ళలోనే.! కాదు కాదు, ఈలోగానే ప్రభుత్వం పడిపోతుంది.! ఇలా ఏవేవో ఊహించేసుకుని, పగటి కలలు కనేస్తున్నారు వైసీపీ నేతలు, కార్యకర్తలు. ఇదంతా నాణేనికి ఓ వైపు మాత్రమే.! వైసీపీని నేతలు ఒకరొకరుగా వీడుతున్నారు. స్థానిక సంస్థలకు సంబంధించి ఒక్కో 'కీలకమైన సీటూ' కోల్పోతూ వస్తోంది వైసీపీ. విశాఖ మేయర్ పీఠం సహా, చాలా కీలక పదవుల్ని వైసీపీ కోల్పోగా, కూటమి ఆ అవకాశాల్ని ఒడిసిపడుతూ వస్తోంది. ఇదంతా ఎందుకు జరుగుతోందన్న ఆత్మ విమర్శ వైసీపీ చేసుకోలేకపోతోంది. పొద్దున్న లేస్తే, దుష్ప్రచారం మాత్రమే.. ఎజెండా.. అన్నట్లుగా వైసీపీ వ్యవహరిస్తోంది. దాంతో, వైసీపీ నేతలు, కార్యకర్తల్లోనూ చాలామంది అధినాయకత్వాన్ని అసహ్యించుకునే పరిస్థితి వస్తోంది.

కార్యకర్తల్ని పట్టించుకుంటాం, కార్యకర్తల్ని ఆదుకుంటాం.. అని వైఎస్ జగన్ చెబుతున్న మాటల్ని కార్యకర్తలెవరూ నమ్మడంలేదు.



అంతెందుకు, వైసీపీ ఉప్పు తిన్న, వైసీపీ అను'కుల' మీడియా కూడా, 'జగన్ 2.0'ని తీవ్రంగా తప్పు పడుతుండడం గమనార్హం. విశాఖలో, ఓ సంస్థకు ఇటీవల ప్రభుత్వం ప్రతిపాదించిన భూ కేటాయింపుల విషయమై వైసీపీ అధినేత వైఎస్ జగన్ చేసిన ఆరోపణలు, వైసీపీ క్యాడర్ చేస్తున్న దుష్ప్రచారం.. అంతా ఫేక్ అని తేలిపోయింది. ఇలా ప్రతిసారీ జరుగుతూ ఉంటే, క్యాడర్‌కి కూడా అధినాయకత్వంపై నమ్మకం పోతుంది. వారానికోసారి బెంగళూరు నుంచి హడావిడి చేసి, మీరంతా దుష్ప్రచారానికే పరిమితం కండి.. అని శ్రేణులకు అధినాయకత్వం ఇస్తున్న టాస్కులు, వైసీపీ కొంప ముంచుతున్నాయి.

## భీమడోలులో కామాక్షి కాలనీలో గ్రావెల్ రోడ్డు పరిశీలన

**దెందులూరు, ఏప్రిల్ 28 (జనస్వరం) :** ప్రతి ఒక్కరూ పారిశుద్ధ్య పరిరక్షణకు కృషి చేస్తూ ఇళ్లలో వాడకం నీరు రోడ్లపైకి రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలనీ భీమడోలు గ్రామ పంచాయతీ కార్యదర్శి తనుజా అన్నారు.సోమవారం భీమడోలు గ్రామ పంచాయతీ పరిధిలోని రూ రెండు లక్షల రూపాయలతో నూతనంగా కంచి కామాక్షి కాలనీలో వేస్తున్న గ్రావెల్ రోడ్లను పంచాయతీ కార్యదర్శి తనుజా పరిశీలించారు. అరుంధతి కాలనీ, జక్కం శెట్టి వారి వీధి, లక్ష్మయ్య మిల్లు వెనక తదితర ప్రాంతాల్లో డ్రైనేజీ అవుట్లెట్ కొరకు స్థల పరిశీలన స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు.



## ప్రపంచాన్ని ఆకట్టుకునేలా స్వతంత్ర సమరయోధుల మ్యూజియం నిర్మించాలి

**- ఎస్టీ కమిషన్ చైర్మన్ డి.వి.జి. శంకర్రావు**

**చింతపల్లి, ఏప్రిల్ 28 (జనస్వరం) :** ఆదివాసీ గిరిజనుల సాంస్కృతిక, భాషా, జీవనశైలిని ప్రపంచానికి తెలియజేసేలా స్వతంత్ర సమరయోధుల మ్యూజియం నిర్మించాల్సిన అవసరం ఉందని, అది ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలవాలని ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ చైర్మన్ డి.వి.జి. శంకర్రావు అన్నారు. సోమవారం జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్, పాడేరు సబ్ కలెక్టర్, ఐటీడీఏ మరియు ఇన్చార్జి ప్రాజెక్టు అధికారి సౌర్యమన్ పటేల్ లతో కలిసి మండలంలోని తాజంగి సమీపంలో నిర్మాణంలో ఉన్న స్వతంత్ర సమరయోధుల మ్యూజియం పనులను ఆయన అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుత్తేదారుల నిర్లక్ష్యంతో మ్యూజియం పనులు నిలిచిపోవడం బాధాకరమని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి పనులను వేగవంతం చేయాలని కోరారు. గిరిజనులు నాగరికతకు దూరంగా ఉన్న పరిస్థితిని గమనించిన అల్లూరి సీతారామరాజు ఆదివాసీలను చైతన్యపరచి, స్వతంత్ర సమరానికి స్ఫూర్తి నింపారని ఆయన పేర్కొన్నారు. ఆదివాసీ సమాజ అభివృద్ధికి గిరిజనులు ఎంతో కృషి చేశారు. అటవీ సంపద





పరిరక్షణలో గిరిజనుల పాత్ర ఎనలేనిది. దేశ స్వాతంత్ర్య పోరాటంలో గిరిజనుల త్యాగం కూడా అపూర్వమైనదని ఆయన గుర్తుచేశారు. స్వతంత్ర సమరయోధుల మ్యూజియం నిర్మాణంలో గిరిజనుల సాంస్కృతిక వైభవం, భాషలు, వాడుక పనిముట్ల ప్రదర్శనకు ప్రత్యేక స్థానం కల్పించి, ప్రపంచ దేశాలను ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలని ఆయన సూచించారు. మారుమూల గిరిజన గ్రామాల్లో పాఠశాలలను అభివృద్ధి చేసి నాణ్యమైన విద్య అందించేందుకు, గిరిజన ప్రాంతాలకు తక్కువ సమయంలో వైద్యసేవలు చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అంతేకాక, మన్య ప్రాంతం కోసం పోరాడిన మహానుభావుల చిత్రాలను మ్యూజియంలో ఏర్పాటు చేసి, ప్రతి ఏడాది విద్యార్థులకు అవగాహన కల్పించేలా ప్రణాళిక రూపొందించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ ఇంజనీర్ జి రఘునాధ నాయుడు, గిరిజన సంక్షేమ శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ యాదకిషోర్, స్వాతంత్ర సమరయోధుల మ్యూజియం క్యూరేటర్ డాక్టర్ శంకర్రావు, గిరిజన సంక్షేమ శాఖ పాడేరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ డేవిడ్ రాజు, తహశీల్దార్ బి రవికుమార్, ఎంపీడీవో యు వి ఎస్ శ్రీనివాసరావు మండల అధికారులు పాల్గొన్నారు.

## మల్లన్న సేవలో.. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి

**శ్రీశైలం ఏప్రిల్ 28 (జనస్వరం) :** శ్రీశైలభ్రమరాంబమల్లికార్జున స్వామివార్లను ఆంధ్రప్రదేశ్ హైకోర్టుప్రధాన న్యాయమూర్తి వి. శ్రీనివాసరావు దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. స్వామివార్ల దర్శనార్ధమై సోమవారం ఉదయం ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న న్యాయమూర్తి దంపతులకు కార్యనిర్వాహణాధికారి యం. శ్రీనివాసరావు, ఆలయ అధికారులు, అర్చక వేదపండితులు ఆలయ సంప్రదాయంలో భాగంగా స్వాగతం పలికారు. వీరు మల్లికార్జునస్వామి వారికి విశేష రుద్రాభిషేకం,శ్రీభ్రమరాంబదేవికి విశేష కుంకుమార్చనాదివిశేష పూజలు నిర్వహించు కున్నారు.పూజల అనంతరం ఆలయ సంప్రదాయంలో భాగంగా అమ్మవారి ఆలయప్రాంగణంలోని ఆశీర్వచన మండపములో న్యాయమూర్తిదంపతులకు అర్చకవేదపండితులు ఆశీర్వచనాలు వల్లించగా కార్యనిర్వాహణాధికారి యం. శ్రీనివాసరావు స్వామివార్ల శేషవస్త్రాలను,స్వామివార్ల జ్ఞాపిక, ప్రసాదములను అందజేశారు.



## మూడు చక్రాల బ్యాటరీ వాహనాన్ని ఉచిత పంపిణీ

ఏలూరు, ఏప్రిల్ 28, (జనస్వరం) : జిల్లా కలెక్టరేటు గోదావరి సమావేశ మందిరంలో శారీరక విభిన్న ప్రతిభావంతులయిన జంగారెడ్డిగూడెం వాస్తవ్యులు వీరవల్లి శంకర రావు రూ 65 వేలు విలువచేసే మూడు చక్రాల బ్యాటరీ వాహనాన్ని జిల్లా కలెక్టరు ఉచిత పంపిణీ చేశారు.మూడు చక్రాల బ్యాటరీ వాహనాన్ని మంజూరు చేయవలసినదిగా కోరుచూ పిజిఆర్ యస్ కార్యక్రమము నందు గతంలో అర్జీ సమర్పించుట జరిగింది. దీంతో జిల్లా కలెక్టరు స్పందించి మూడు చక్రాలు వాహనాన్ని మంజూరు చేసి ఈ రోజు పంపిణీ చేయుట జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ మూడు చక్రాల బ్యాటరీ వాహనం ద్వారా చిరు వ్యాపారాలు చేసుకుని కుటుంబాన్ని ఆర్థికంగా బలోపేతం చేసుకోవాలని జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి సూచించారు.మూడు చక్రాల బ్యాటరీ వాహనం ఉచిత అందజేసినందులకు వీరవల్లి శంకరరావు జిల్లా కలెక్టరుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ సహాయ సంచాలకులు బి.రామ్ కుమార్,సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## ఆడబిడ్డల చదువుకు మణికర్ణిక యువజన సంఘం ఆర్థిక సహాయం

**జగ్గంపేట, ఏప్రిల్ 28, జనస్వరం :** పేదింటి ఆడబిడ్డల చదువుకు మణికర్ణిక యువజన సంఘం సహకారాన్ని అందించింది. విద్యాంజలి అనే కార్యక్రమం ద్వారా పేద ఆడ పిల్లలను చదివించాలనే లక్ష్యంతో పదవ తరగతిలో బాగా చదివిన ముగ్గురు పేద విద్యార్థినులను ఇంటర్ చదివించేందుకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షురాలు గున్నాబత్తుల అనూష సోమవారం మీడియాతో మాట్లాడుతూ టెన్త్ లో మంచి మార్కులు సాధించి బాగా చదవుకోవాలనే కోరిక ఉన్నా ఆర్థిక పరిస్థితిలేని కారణంగా చదువు ఆపేయాలని అనుకుంటున్నవారిని ఎంపిక చేయడం జరిగిందన్నారు. వారిలో తండ్రి లేని కిర్లంపూడి మండలం బూరుగుపూడికి గ్రామానికి చెందిన టప సంజన, గండేపల్లి మండలం నీలాద్రిరావుపేట చెందిన సోదగిరి కీర్తన ఉన్నారన్నారు. అలాగే ఒక కంటి చూపుతో కష్టపడి చదివి 529 మార్కులు సాధించిన జెడ్. రాగంపేటకు చెందిన డోళ్ళ హెబ్సిబా ను ఎంపిక చేశామన్నారు. ఈ ముగ్గురు అమ్మాయిలను స్థానిక ప్రైవేటు కళాశాలలో చదివించేందుకు మెడిది సుబ్బయ్య ట్రస్ట్ వ్యవస్థాపకులు మెడిది రావు ముందుకు రావడం జరిగిందన్నారు. వారికి అయ్యే ఫీజులకు గాను 80 వేలు రూపాయల చెక్ ను మణికర్ణిక యువజన సంఘానికి అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మెడిది సుబ్బయ్య ట్రస్ట్ సభ్యులు సుజాత, రామ్, అంజనీ కుమారి, రోజా, మణికర్ణిక సభ్యులు




మొగలంక శ్రీను, చిక్కాల మణికంఠ, రమణి చిన్ని, వంశీ, వీరబాబు, పీలా మణికంఠ పాల్గొన్నారు.

## కళ్యాణభరితంగా స్వామివార్లకు సహస్రదీపార్చన

శ్రీశైలం ఏప్రిల్ 28 (జనస్వరం) : శ్రీభ్రమరాంభమల్లికార్జున స్వామివార్ల ఆలయప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. మహాశివుడికి ప్రీతికరమైన రోజు సోమవారం కావడంతో శ్రీభ్రమరాంభమల్లికార్జునస్వామి వార్ల ఆలయప్రాంగణం సహస్ర దీప శోభితంగా కనిపించింది. దీపమండపంలోని స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు విశేషపూజలు నిర్వహించిన తదుపరి ఆలయ అర్చకులు సహస్రదీపాలను వెలిగించారు.



## వడదెబ్బపై అప్రమత్తత అవసరం : ఏలూరు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి

**ఏలూరు, ఏప్రిల్ 28, (జనస్వరం) :** ప్రజలందరూ వడదెబ్బకు గురికాకుండా ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి సూచించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ హాల్‌లో వడదెబ్బ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డి ఎం హెచ్ ఓ ఆర్. మాలిని, డిసిహెచ్ఎస్ డా. పాల్ సతీష్ కుమార్ లతో కలెక్టర్ సమీక్షించారు. వడదెబ్బ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన పరచాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలందరూ వడదెబ్బకు గురికాకుండా ఉండాలంటే తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రోజూ తగినన్ని నీళ్లు తాగడం, నేరుగా ఎండ వేడిమి తాకకుండా జాగ్రత్తలు పాటించడం ముఖ్యమని చెప్పారు. ముఖ్యమైన పనుల మినహా మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు బయటకు వెళ్లకూడదని, ఈ సమయంలో శారీరక శ్రమ అవసరమైన పనులను నిర్వహించకూడదని సూచించారు. పిల్లలు, గర్భిణీలు మరియు వృద్ధులు ఎండాకాలం మరింత శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రజలు,అధికారులు, సిబ్బంది బయటకు వెళ్లే సమయంలో తల కప్పుకునే విధంగా టోపీలు, గుడ్డ మఫ్లర్లు వాడాలని సూచించారు. లేత రంగుల నూలు దుస్తులు ధరించాలన్నారు. ఆరోగ్యన్నీ దృష్టిలో ఉంచుకుని ఆల్కహాల్, మత్తు పదార్థాలు తీసుకోవడం మానుకోవడం అవసరమని పేర్కొన్నారు. అధిక మసాలా ఉన్న ఆహారం తినకుండా, పోషకతత్వంతో కూడిన తేలికపాటి ఆహారం తీసుకోవాలన్నారు. శుభ్రమైన తాగునీటినే ఉపయోగించాలని, కూల్‌డ్రింక్స్, అధిక చక్కెర ఉన్న పానియాలు, కాఫీ, టీ వంటి పానీయాలను తగ్గించాలని సూచించారు. వడదెబ్బతగిలి అపస్మారక పరిస్థితిలో ఉన్న రోగికి నీరు తాగించకూడదని, వీలయినంత త్వరగా దగ్గరలోని ఆసుపత్రికి తరలించాలన్నారు. చెమట పట్టక పోవడం, వణుకు పుట్టడం మగత నిద్ర లేదా కలవరింతలు, శరీర ఉష్ణోగ్రత పెరగడం, ఫిట్స్ లేదా పాక్షికంగా అపస్మారక స్థితిలోకి వెళ్లడం వడదెబ్బ లక్షణాలని పేర్కొన్నారు. ఆసుపత్రుల్లో, గ్రామాల్లో ఆశా వర్కర్ల వద్ద ఓఆర్ఎస్ (ORS) అందుబాటులో ఉన్నందున, అవసరమైన వారు దీన్ని ఉపయోగించుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. తీవ్రమైన వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే, సంబంధిత వ్యక్తిని వెంటనే 108 అంబులెన్స్ సహాయంతో దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలని తెలిపారు.



## లోకాకళ్యాణార్థం.. స్వామి అమ్మవార్లకు వెండి రథోత్సవ సేవ

**శ్రీశైలం ఏప్రిల్ 28 (జనస్వరం) :** శ్రీభ్రమరాంభమల్లికార్జున స్వామివార్ల సన్నిధిలో దేవస్థానం నిర్వహిస్తున్న కైంకర్యాలలో భాగంగా సోమవారం సాయంత్రం ఉభయదేవాలయాల ప్రాంగణంలో స్వామిఅమ్మవార్ల కు వెండిరథోత్సవసేవను శాస్త్రోక్తంగా నిర్వహించారు. వెండిరథంను వివిధ రకాల పుష్పాలతో సర్వాంగా సుందరంగా అలంకరించి స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను వెండి రథంలోకి ఆశీనులను చేసి తదుపరి విశేషపూజలు నిర్వహించి కళ్యాణభరితంగా ఆలయ ప్రదక్షిణలు నిర్వహించారు. ఈ వెండిరథోత్సవసేవలో ఆలయ అధికారులు,అర్చక, వేదపండితులు,భక్తులు పాల్గొన్నారు.



## గుడిపాడులో లక్ష్మీ ఆక్వా ఫీడ్ అండ్ నీడ్స్ షాపు ప్రారంభం

**పెదపాడు, ఏప్రిల్ 28 (జనస్వరం) :** చేపల మేతలకు నాణ్యమైన మరియు మంచి ఉత్పత్తులు అందించడం ద్వారా రైతుల అభివృద్ధి మరియు సంక్షేమంలో దీపక్ నెక్స్‌జన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఎప్పుడూ ముందుంటుందని మేనేజింగ్ డైరెక్టర్ అడుసుమిల్లి సుబ్రహ్మణ్యం తెలిపారు. సోమవారం మండలంలోని గుడిపాడు గ్రామంలో గ్రామ ప్రముఖుడు సైదు సోమేశ్వరరావు నూతనంగా ఏర్పాటు చేసిన లక్ష్మీ ఆక్వా ఫీడ్స్ అండ్ నీడ్స్ షాపును దీపక్ నెక్స్‌జన్ ఫీడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత అడుసుమిల్లి వెంకట సుబ్రహ్మణ్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా దీపక్ నెక్స్‌జన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ డైరెక్టర్ అడుసుమిల్లి వెంకట సుబ్రహ్మణ్యం, లక్ష్మీ ఆక్వా ఫీడ్స్ గుడిపాడు షాప్ అధినేత సైదు సోమేశ్వరరావు మాట్లాడుతూ, "గుడిపాడు గ్రామంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు తమ వ్యాపారాన్ని ఆశీర్వదించాలని కోరుకుంటున్నాం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో దీపక్ నెక్స్‌జన్ సీడ్స్ టెక్నికల్ చీఫ్ హెడ్ డాక్టర్ ఎం.వి.డి. మల్లేశ్వరరావు, సీఓఓ ఏ.వి. శేషాద్రి రావు, వాల్విన్ ఆక్వా ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ కురెళ్ళ రాజేంద్రప్రభు, కార్తికేయ ఆక్వా ఫీడ్స్ ఎం. కల్కేశ్వరరావు, మార్కెటింగ్ యాడ్ కె. రాజేశ్వరరావు, కంపెనీ అధికారి దుర్గాప్రసాద్, గుడిపాడు గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు జయ మంగళ నాగేంద్ర శ్రీనివాసరావు, విజయ మంగళ తరుణ్ బాబు, జయ మంగళ ఈశ్వర్ రాజు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.





# దేగాం గ్రామంలో ప్రపంచ మేధావి అంబేద్కర్ జయంతి వేడుకలు

**- పంచశీల జెండా ను ఆవిష్కరణ చేసిన చైర్మన్ లింగన్న**
**- గ్రామ అభివృధి కమిటీ సభ్యులు 7 లక్షల మంజూరు చేయండి జై భీమ్ సేన యూత్ సభ్యులు**
**- పంచశీల బుద్ధ విహార్ కు నిధులు కొరకు ఎమ్మెల్యే కు ప్రతిపాదనలు పంపిస్తాను**

**భైంసా, ఏప్రిల్ 28 (జనస్వరం) :** భారత రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ 134వ జయంతి వేడుకలు భైంసాలోని పంచశీల బుద్ధ విహార్ వద్ద జై భీమ్ సేన యూత్ సభ్యులు, బౌద్ధ ప్రజలు, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు కలిసి





ఎంతో ఘనంగా నిర్వహించారు. ముందుగా గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ లింగన్న చేతుల మీదుగా పంచశీల జెండాను ఆవిష్కరించారు. అనంతరం జై భీమ్ సేన యూత్ సభ్యులు, బౌద్ధ ప్రజలు కలిసి గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులకు శాలువా కప్పి సత్కారం చేశారు. ఈ సందర్భంగా జై భీమ్ సేన యూత్ సభ్యులు మాట్లాడుతూ, "పంచశీల బుద్ధ విహార్ నిర్మాణానికి ఇప్పటి వరకు ఎస్సీ కాలనీ అభివృద్ధి కోసం నయాపైసా కూడా మంజూరు కాలేదని, కనుక 7 లక్షల నిధులు మంజూరు చేసి బుద్ధ విహార్ నిర్మాణం చేపట్టాలని" కోరారు. సభలో



మాట్లాడిన సిరం సుష్మా రెడ్డి, "డాక్టర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ద్వారా మహిళలకు సమాన హక్కులు లభించాయని, సభల్లో కుర్చీలపై కూర్చోవడానికి అవకాశం కల్పించిన గొప్ప నాయకుడు అంబేద్కర్" అని తెలిపారు. నాని లక్ష్మణ్ మాట్లాడుతూ, "అంబేద్కర్ అంటే నాకు చాలా ఇష్టం. ఇప్పుడు కూడా నా ఫోన్ రింగ్‌టోన్‌గా అంబేద్కర్‌కు సంబంధించిన టోన్‌ను ఉపయోగిస్తున్నాను" అన్నారు. గంగాధర్ మాట్లాడుతూ, "డాక్టర్ అంబేద్కర్ దయవల్లే నా పిల్లలు బాగా చదివి డాక్టర్లు అయ్యారు. రాజ్యాంగం మనకు రక్షణ కల్పిస్తున్నది" అని పేర్కొన్నారు.

## తెలంగాణ

# కళారాధనలో... నృత్యప్రదర్శన

**శ్రీశైలం ఏప్రిల్ 28 (జనస్వరం) :** శ్రీశైలదేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా సోమవారం ఏర్పాటుచేసిన సంప్రదాయ నృత్యప్రదర్శన భక్తులకు విశేషంగా అలరించింది.శ్రీ స్వామిఅమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్ని పరిపూర్ణంగా జరగాలని మరియు ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా ఆలయ దక్షిణమాడవీధిలోని ధర్మపథం వేదికపై శ్రీభవాని క్లాసికల్ డాన్స్ అకాడమి సిద్దిపేట వారిచే సంప్రదాయ నృత్యప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ నృత్యప్రదర్శనలో కళాకారులు పలు భక్తి గీతాలకు, అష్టకష్టాలకు నృత్యప్రదర్శన చేశారు.ఈ నిత్యకళారాధనలో ప్రతిరోజుహరికథ, బుర్రకథ, సాంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని కార్యక్రమాలు నిర్వహిస్తారు.




# ఘనంగా ముగిసిన చింతపల్లి ముత్యాలమ్మ జాతర : భక్తులు, ప్రజాప్రతినిధులకు ఉత్సవ కమిటీ కృతజ్ఞతలు

**చింతపల్లి, ఏప్రిల్ 28 (జనస్వరం) :** మండల కేంద్రంలోని ప్రతి ఏడాది జరిగే గ్రామదేవత శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవం ఈ సంవత్సరం అంగరంగ వైభవంగా ముగిసింది. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, భక్తులు, ప్రజలు సమిష్టిగా పాల్గొని పండుగకు విశేష శోభ చేకూర్చారు. జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్, సబ్ కలెక్టర్ మరియు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి సౌర్యమన్ పటేల్, జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్, చింతపల్లి సబ్ డివిజన్ ఏఎస్పి నవజ్యోతి మిశ్రా తదితర అధికారులు ప్రత్యక్ష పర్యవేక్షణలో పండుగను ప్రశాంతంగా పూర్తి చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సీఐ వినోద్ బాబు, ఎస్సైలు వెంకటరమణ, వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ఈ మహోత్సవాన్ని పురస్కరించుకుని పాడేరు శాసనసభ్యులు మత్సరాస విశ్వేశ్వర రాజు, అరకు ఎంపీ గుమ్మ తనుజరాణి, ఉమ్మడి జిల్లా చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, టీడీపీ ఇంచార్జ్ గిడ్డి ఈశ్వరి, జి.సి.సి చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్, మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు, మాజీ శాసనసభ్యులు కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి, మాజీ ఎంపీ గొడ్డేటి మాధవి, ఎంపిపి కోరాబు అనూష దేవి, జడ్పీటిసి పోతురాజు బాలయ్య తదితరులు తమ మద్దతు ప్రకటించారు. డిప్యూటీ తహశీల్దార్ జి రాజ్ కుమార్, ఎంపిడిఓ శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ డివిజనల్ అధికారి సంతోష్ కుమార్ పర్యవేక్షణలో ఉత్సవ కమిటీకి మద్దతు అందించారు. పట్టణ పారిశుద్ధ్య బాధ్యతను పంచాయతీ శాఖ సమర్థంగా నిర్వహించగా, నీటి పారుదల శాఖ నిరంతర నీటి సరఫరా చేపట్టింది. స్థానిక సర్పంచ్ దురియా పుష్పలత, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ తదితరులు చక్కటి సన్నాహాలు చేశారు. జాతర సందర్భంగా వివిధ శాఖల ఏర్పాటు చేసిన స్టాల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ముఖ్యంగా ఐసీడీఎస్ వారు ఏర్పాటు చేసిన స్టాల్ ప్రజలను ఆకట్టుకుంది. గ్రామ ప్రజలు ముత్యాలమ్మ జాతర విజయానికి విశేష ఆర్థిక సహాయం అందించగా, ఆదివాసి ట్రస్ట్ చైర్మన్ కోరాబు బాలం పడాల్, వర్తక సంఘం, మోటార్ యూనియన్ తదితర సంఘాలు సమగ్ర మద్దతు అందించాయి. యువత ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉత్సవ విజయవంతానికి కృషి చేసిన ప్రతి సంస్థకు, ప్రతి వ్యక్తికి ఉత్సవ కమిటీ తరపున అధ్యక్షులు హేమంత్ కుమార్, పసుపులేటి వినాయకరావు, పోతురాజు బాలయ్య, కార్యనిర్వహక కార్యదర్శి పెదిరెడ్ల బేతాళుడు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# పహల్గామ్ దాడికి నిరసనగా ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ

**యలమంచిలి, ఏప్రిల్ 28, జనస్వరం :** పట్టణంలో సోమవారం యలమంచిలి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో పహ్లాగం దాడికి నిరసనగా కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించడం జరిగింది. యలమంచిలి బస్ కాంప్లెక్స్ నుండి దిమిలి రోడ్ జంక్షన్ అంబెద్కర్ విగ్రహం వరకు ర్యాలీ గా వెళ్లడం జరిగింది. ఈ కార్యక్రమంలో యలమంచిలి ఎంపీపీ గోవింద్, యలమంచిలి మాజీ ఎమ్మెల్యే పప్పుల చలపతిరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ గోవింద్ మాట్లాడుతూ పహ్లాగం దాడి చాలా బాధకారమైనది అని, దేశంలో ఉన్న రాజకీయ పార్టీల అన్ని పార్టీలకు అతీతంగా కేంద్ర ప్రభుత్వం కి మద్దతు తెలపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఎర్రయ్యదొర, వైకాపా నాయకులు, టీడీపీ నాయకులు ప్రెస్ క్లబ్ సభ్యులు, గంగాధర్, చిట్టిబాబు, సుబ్బరాజు, శ్రీమాన్, సంతోష్, ధీరజ్ తదితరులు పాల్గొన్నారు




# ముగిసిన శ్రీరామ రక్షా రథయాత్ర

**యలమంచిలి/రాంబిల్లి ఏప్రిల్ 28 జనస్వరం :** యలమంచిలి నియోజకవర్గం రాంబిల్లి మండలంలో సోమవారంతో శ్రీరామరక్ష రథయాత్ర ముగిసింది. మర్రిపాలెం, కుమ్మరాపల్లి, మొరకాడ, రజాల, కట్టుబోలు, దిమిలి గ్రామాలలో విశాఖ డైరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో శ్రీరామరక్షా రథయాత్ర యలమంచిలి పురపాలక సంఘం చైర్ పర్సన్ పీలా రమకుమారి పర్యవేక్షణలో ఆరు రోజులపాటు జరిగింది. గ్రామాలలో ప్రజలు శ్రీరామరక్షా రథానికి కోలాటాలు తప్పుడు గుళ్ళతో స్వాగతం పలికి బ్రహ్మరథం పట్టారు. చిన్న పెద్ద తేడా లేకుండా బాల రాముని దర్శించుకున్నారు. వేద పండితులు శ్రీమన్నారాయణకి హారతి ఇచ్చే విధానంతో ప్రజలందరూ శ్రీరామభక్తి లో మునిగిపోయారు. అనంతరం మంగళవారం నుండి యలమంచిలి మండలంలో



ప్రారంభం అవుతుందని తెలియజేశారు. వసంతవాడ దిన్ బాబు, వర్మ, రవి వర్మ, శివాజీ రాజా బహదూర్, కొల్లి అప్పారావు, జయరాం, పప్పు ఈశ్వరరావు, పడాల గుర్నాథరావు, మూర్తి శ్రీను. సర్పంచులు, ఎంపీటీసీలు, పెద్దలు మరియు భక్తులు పాల్గొన్నారు.



# ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను జయప్రదం చేయాలి

## లేబర్ కోడ్స్ కు వ్యతిరేకంగా జరిగే మే 20 దేశవ్యాప్త కార్మిక సమ్మెను జయప్రదం చేయాలి - సీఐటీయూ

**యలమంచిలి, ఏప్రిల్ 28, జనస్వరం :** స్థానిక అలువేలుమంగ స్కూల్ వద్ద సోమవారం సీఐటీయూ మండల కమిటీ సమావేశం మండల కార్యదర్శి సిహెచ్. శివాజీ అధ్యక్షతన జరిగింది ఈ సందర్భంగా సిఐటియూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు మాట్లాడుతూ కార్మికుల బలిదానాలతో 8 గంటల పని సాధించిన ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే ను కార్మికులందరూ పతాకావిష్కరణలో పాల్గొని సంస్కృతిక, సేవా కార్యక్రమాలు చేయాలని, కేంద్రంలో బిజెపి మోడీ ప్రభుత్వం దొంగచాటుగా కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్ కింద మార్చి వాటిని అమలు చేయడం కోసం ప్రయత్నాలు ముమ్మరం చేసింది దీనిని నిరసిస్తూ దేశంలో ఉన్న అన్ని కార్మిక , రైతు సంఘాలు మే 20 తేదీన దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చాయి. ఈ చట్టాలు అమలు జరిగితే ఇప్పుడున్న కార్మిక హక్కులు ఉండవని ప్రైవేటీకరణ, కాంట్రాక్టు పద్ధతిలో అతి తక్కువ జీతాలతో పని చేయడం పని భద్రత లేకపోవడం వంటి అనేక సమస్యలతో కార్మిక వర్గం తీవ్ర ఇబ్బందులు గురవుతారని ఈ లేబర్ కోడ్స్ కు వ్యతిరేకంగా జరిగే సమ్మెలో కార్మికులందరిలో ప్రచారం నిర్వహించి మే 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం లేబర్ కోడ్లను రద్దు చేయాలని బుక్లెట్ విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో మండల కమిటీ సభ్యులు బి.శశి కళ, పి.జానకి, కూర్మారావు, డి.రాజు, వరలక్ష్మి,



కొండలరావు తదితరులు పాల్గున్నారు.

అక్షరమా..!
మనిషి తెలివిమీరిన చేష్టలు చేస్తూ.. పకృతి మాతకు విఘాతం కలిగిస్తూ..
రకరకాల ఉడుపులతో వేషధారణ చేస్తూ..
మతిమాలిన మితిమీరిన తెలివితేటలతో సంస్కృతి సంప్రదాయాలను నాశనం చేస్తూ..
కాయంలో ప్రాణం పోయాక
ఒక్క క్షణం కూడా ఇంట్లో
ఉంచుకోని బంధాలు కోసం అబద్ధాలు, మోసాలు చేస్తూ..
కళేబరాలతో కల్తీ నూనెలు తయారు చేస్తూ..
రాజ్యం ఏలుతున్న
దుష్ట నికృష్టు రక్కసులను
నామరూపాలు లేకుండా
చేసే అణ్వాయుధమైపో అక్షరమా..!
గుంట నక్కల మాయతెరల వెనుక కృంగుతున్న.. కనులుండీ కబోదులుగా మారుతున్న
ప్రతి మనిషి లోని అజ్ఞాన తిమిరాలను సంహరణ చేసి వారి జీవితాల్లో చిరుదీపమై వెలిగేట్లు
చేయి అక్షరమా..!

మంజుల పత్తిపాటి (కవయిత్రి).
మాజీ ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్.



# రసవత్తరంగా సాగిన మండల మహిళా సమాఖ్య ఎన్నిక

**బొంరాస్ పేట, ఏప్రిల్ 28 (జనస్వరం) :** మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో సోమవారం మండల మహిళా సమైక్య 24వ వార్షిక మహాసభ ఘనంగా నిర్వహించారు. విచిత్రమేంటంటే, ఎన్నికల అధికారిగా వ్యవహరించాల్సిన డిపిఎం రామ్మూర్తి గైర్హాజరయ్యారు. దీంతో నూతన కార్యవర్గం ఎన్నిక ఓటింగ్ విధానంలో రసవత్తరంగా ముగిసింది. ఈ ఎన్నికల్లో గంజిపల్లి కవిత (ఏర్పుమళ్ళ) మండల నూతన అధ్యక్షురాలిగా, మూడవత్ సునీత (తెట్టేకుంటతాండ) కార్యదర్శిగా, కుమ్మరి సునీత (చిల్ముల్ మైలారం) కోశాధికారిగా ఎన్నికయ్యారని ఏపీఎం సాయన్న తెలిపారు. నూతనంగా ఎన్నికైన సభ్యుల పదవీకాలం మూడు సంవత్సరాలు ఉంటుంది. ఎన్నికల అనంతరం, డిపిఎం రామ్మూర్తి సమక్షంలో నూతన కార్యవర్గ సభ్యులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీసీలు రాంచంద్రయ్య, యాదయ్య, సంజీవ్, సునీత, భీమయ్య, అకౌంటెంట్ సునీత, మాజీ అధ్యక్షురాలు అనిత, మాజీ కార్యదర్శి






అంబుజా, మాజీ కోశాధికారి భాగ్యమ్మ, వివిధ గ్రామాల గ్రామ సంఘాల కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్రుల అన్నపూర్ణమ్మ డొక్కా సీతమ్మ వర్ధంతి

**సర్వేపల్లి, ఏప్రిల్ 28 (జనస్వరం) :** నియోజకవర్గ జనసేన పార్టీ ఆధ్వర్యంలో, పొదలకూరు మండలంలోని పొదలకూరు పంచాయతీ పరిధిలోని శ్రామికనగర్ గిరిజన కాలనీలో గిరిజనులతో కలిసి డొక్కా సీతమ్మ తల్లి వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్ నాయుడు మాట్లాడుతూ, "1841 నుంచి 1909 వరకు జీవించిన డొక్కా సీతమ్మ ఎన్నో సంవత్సరాల పాటు ఆకలితో బాధపడే వారికి ఆహారం అందించి ఆంధ్రుల అన్నపూర్ణమ్మగా నిలిచారు. వారి నిస్వార్థ సేవను ప్రతి ఒక్కరు స్మరించుకోవాలి" అని తెలిపారు. డొక్కా సీతమ్మ తల్లి ఆశయాలను ముందుకు తీసుకువెళ్లేందుకు, జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొత్త అన్న క్యాంటీన్లకు "అన్నపూర్ణమ్మ క్యాంటీన్"గా పేరు పెట్టడం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. "ఆ మహాతల్లి ఆశయ సాధనలో మేమంతా నడుస్తున్నాం. ఆకలితో ఉన్నవారికి ఎల్లప్పుడూ జనసేన అండగా ఉంటుంది" అని చెప్పారు. వర్ధంతి సందర్భంగా గిరిజన కాలనీలోని పిల్లలకు బిస్కెట్లు మరియు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పొదలకూరు మండల నాయకులు నారదాసు రవి, మధు, సందూరి శ్రీహరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.





# పెదపాడు గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు ప్రారంభం

**పెదపాడు, ఏప్రిల్ 28 (జనస్వరం) :** పెదపాడు శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం లో భాగంగా, మొదటి రోజు కార్యక్రమం 28/04/2025 సోమవారం ఆసక్తికరంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా పెదపాడు ఎం.ఈ.ఓ డి.వి. రమణ పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, "గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు. ప్రతి విద్యార్థి, విద్యార్థినీ వీటిని సద్వినియోగం చేసుకోవాలి," అని సూచించారు. వేసవి విజ్ఞాన శిబిరంలో ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో జరుగుతున్న కార్యక్రమాల్లో పాల్గొని మంచి విజ్ఞానం సంపాదించుకోవాలని కోరారు. ఎం.ఈ.ఓ స్వయంగా పిల్లలతో కలిసి "చెస్" ఆట ఆడి, ఆ ఆట విశేషాలు వివరించారు. అనంతరం కథలు చెప్పి, కథలు చదివించారు. ఈ కార్యక్రమంలో ఎం.పీ.పీ. స్కూల్ హెచ్.ఎం. వేల్పుల ప్రభాకర్, శ్రీకృష్ణ గురుకులం కరస్పాండెంట్, హెచ్.ఎం., ఉపాధ్యాయులు భీమవరపు వంశీ మోహన్, రామాల బెంజిమెన్, శేటికం వెంకటేశ్వరరావు, జీ.వి. ఆంజనేయులు పాల్గొన్నారు. వారు చిన్నారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మొత్తం 33 మంది విద్యార్థులు, విద్యార్థినులు పాల్గొన్నారు. గ్రంథాలయ అధికారి దుగ్గిపోగు జాన్ బాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది.



# బాల్యవివాహాలు ఆపేవిధంగా చర్యలు తీసుకోవాలి

**జగ్గంపేట, ఏప్రిల్ 28 (జనస్వరం) :** గ్రామాల్లోని పెద్దలు 18 ఏళ్ల లోపు బాలికలకు వివాహాలు చేయడాన్ని ఆపే విధంగా చర్యలు తీసుకోవాలని ఐసిడిఎస్ జగ్గంపేట ప్రాజెక్ట్ సిడిపిఒ ఎం.పూర్ణిమ అంగన్వాడీ కార్యకర్తలకు సూచించారు. సోమవారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద కార్యదర్శి శివ అధ్యక్షతన కిశోర్ వికాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ మాట్లాడుతూ, "15 సంవత్సరాల నుండి 18 సంవత్సరాల లోపు వయస్సు గల బాలికలకు కిశోర్ వికాసం పై అవగాహన కల్పించాలి" అని సూచించారు. దీనికి గాను ప్రతి గ్రామస్థాయిలో ఒక కమిటీ ఉంటుందని, అందులో మహిళా పోలీసు కన్వీనర్‌గా, అంగన్వాడీ టీచర్, ఏఎన్ఎం, ఆశా వర్కర్ సభ్యులుగా ఉంటారని తెలిపారు. ఈ కమిటీ సభ్యులు మే 2వ తేదీలోపు సెలవుల్లో ఉన్న బాలికలను, బడిబయట ఉన్న బాలికలను గుర్తించి, గ్రూపులు ఏర్పాటు చేసి అవగాహన కల్పించాల్సిందిగా సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసులు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు ప్రారంభం

**దెందులూరు, ఏప్రిల్ 28 (జనస్వరం) :** మండలంలోని పోతునూరు శాఖా గ్రంథాలయంలో విజ్ఞాన శిక్షణ తరగతులు ఘనంగా నిర్వహించారు. వివిధ స్కూల్ ల నుండి విద్యార్థిని, విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ శిక్షణ తరగతులను పోతునూరు జడ్పీహెచ్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎస్.కె అస్సాన్ వలి ఆధ్వర్యంలో నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా వలి మాట్లాడుతూ గ్రంథాలయాల ఆవశ్యత గురించి చెప్పి వాటిని సక్రమంగా వినియోగించుకోవాలని తెలిపారు. మరొక రిసోర్స్ పర్సన్ ఎల్ యేసయ్య మాట్లాడుతూ పిల్లలకు జీకే మరియు ఇంగ్లీష్ స్కిల్స్ గురించి బోధించారు. అనంతరం పిల్లలకు స్నాక్స్ అందించారు.



# జీతాలు ఇప్పించాలని వినతి

**పులివెందుల ఏప్రిల్ 28 (జనస్వరం) :** పులివెందుల నియోజకవర్గం వేంపల్లె గ్రామపంచాయతీలోని సచివాలయ సిబ్బంది రెండు నెలలుగా జీతాలు అందలేదని సోమవారం వేంపల్లె ఎంపీడీఓ కులాయమ్మకు వినతిపత్రం అందజేశారు. పంచాయతీ సుబ్బారెడ్డి సస్పెండ్ కావడంతో వేంపల్లి పరిధిలోని ఎనిమిది సచివాలయాలకు సంబంధించిన 60 మంది ఆయా సచివాలయాల ఉద్యోగులకు జీతాలు అందలేదని ఇబ్బంది పడుతున్నారు. ఈ సందర్భంగా సిబ్బంది కలిసి వేంపల్లి ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. త్వరగా జీతాలు వచ్చేల చర్యలు తీసుకోవాలని సచివాలయ ఉద్యోగులు ఎంపీడీఓ ను కోరారు.



# బదిలీలు పదోన్నతులకు సంబంధించి మ్యానువల్ కౌన్సిలింగ్ నిర్వహించాలి

**నంద్యాల, ఏప్రిల్ 28 (జనస్వరం) :** నంద్యాల జిల్లా ఆంధ్ర ప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు ఎం. రామచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.వి. శివయ్య అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు ఎస్. జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ, SGT ఉపాధ్యాయులకు మ్యానువల్ కౌన్సిలింగ్ నిర్వహించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఎనిమిదేళ్ల పాటు పని చేసిన SGT ఉపాధ్యాయులకు సుమారు 1000 నుంచి 1500 వరకు ఐచ్చికాలు ఇవ్వవలసి వస్తుందని, ఆ సమయంలో సర్వర్ సరిగ్గా పని చేయకపోవడం, ఉపాధ్యాయులకు గ్రామాలు, పాఠశాలల వివరాలపై అవగాహన లేకపోవడం వల్ల నష్టపోతున్నారని తెలిపారు. అందువల్ల, SGT ఉపాధ్యాయుల కోసం మ్యానువల్ కౌన్సిలింగ్ నిర్వహించాలని ఏపీటీఎఫ్ డిమాండ్ చేస్తుందని పేర్కొన్నారు. అలాగే, పదోన్నతులకు సంబంధించి కూడా మ్యానువల్ కౌన్సిలింగ్ నిర్వహించాలి అని కోరారు. గత ప్రభుత్వంలో ఆన్లైన్ కౌన్సిలింగ్ పద్ధతి ప్రవేశపెట్టడం వల్ల చాలామంది ఉపాధ్యాయులు ప్రమోషన్లను పొందలేక నష్టపోయారని వివరించారు. ఈసారి ప్రభుత్వం ఉపాధ్యాయులపై దయ చూపి మ్యానువల్ కౌన్సిలింగ్ నిర్వహించాలని కోరారు. అదనంగా, ఉమ్మడి కర్నూలు జిల్లాలో మంజూరైన మోడల్ ప్రైమరీ పాఠశాలల PSHM పోస్టులకు మిగులు స్కూల్ అసిస్టెంట్లను పంపించడం కాకుండా, SGT ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. క్లస్టర్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులను గ్రేడ్ వన్ ప్రధానోపాధ్యాయులుగా గుర్తించాలని కూడా ఏపీటీఎఫ్ తరపున ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో వీరేశ్వర్ రెడ్డి, పుల్లయ్య, రాజేష్, మల్లికార్జున, మధు తదితరులు పాల్గొన్నారు.




# ఎమ్మిగనూరు డిపోలో ప్లే కార్డుల నిరసన, రిలే నిరాహార దీక్షలు

**ఎమిగనూరు, ఏప్రిల్ 28 (జనస్వరం) :** ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు, సోమవారం నాడు ఎమిగనూరు డిపో గేట్ వద్ద డిమాండ్ల సాధన కోసం ప్లే కార్డులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం, రిలే నిరాహార దీక్షలను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి రీజనల్ అధ్యక్షుడు ఎన్.ఆర్. నాయుడు అధ్యక్షత వహించగా, డిపో అధ్యక్ష కార్యదర్శులు ఎస్.ఎం. రఫీక్, ముస్తాక్ అహ్మద్ ఆధ్వర్యం వహించారు. డిపో గేట్ వద్ద నిరసన అనంతరం, దేరా వద్ద నిరాహార దీక్షలు ప్రారంభమయ్యాయి. దీక్షలకు గంగుండి నాగరాజు, ఎం. చంద్రయ్య, కే. తిమ్మప్ప (కండక్టర్లు) కూర్చొన్నారు.

**ప్రధాన డిమాండ్లు :**

- 2019 భద్రతా సర్క్యులర్‌ను అమలు చేయాలి
- ఉద్యోగులకు డబుల్ డ్యూటీ అమౌంట్ పెంచాలి.
- ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంస్థ ద్వారా వేతనాలు పెంచాలి.
- ఉద్యోగులపై అక్రమ సస్పెన్షన్లు, రిమూవల్స్ నిలిపివేయాలి.
- పారదర్శకమైన ట్రాన్స్‌ఫర్ పాలసీ అమలు చేయాలి.
- నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న అన్ని క్యాటగిరీల్లో ప్రమోషన్లు ఇవ్వాలి.
- మహిళా ఉద్యోగులకు పిల్లల సంరక్షణ సెలవులు ఇవ్వాలి.
- నాన్-ఓపరేషన్ ఉద్యోగుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి.
- అనారోగ్య సెలవులకు పూర్తి జీవితం ఇవ్వాలి.
- పాత వైద్య విధానాన్ని (ఈహెచ్ఎస్ స్థానంలో) పునరుద్దరించాలి.
- ఎలక్ట్రిక్ బస్సులు ఆర్టీసీ/ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేయాలి.
- ఆర్టీసీలో క్యాడర్ స్ట్రెంగ్త్ విధిగా అమలు చేయాలి.
- రిటైర్డు ఉద్యోగుల దంపతులకు సూపర్ లగ్జరీ బస్సుల్లో ప్రయాణ అనుమతి ఇవ్వాలి.
- ఆఫీస్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి.
- అవసరాన్ని బట్టి ఉద్యోగులకు ఈఓఎల్ మంజూరు చేయాలి.

ఈ సందర్భంగా రీజనల్ అధ్యక్షుడు ఎన్.ఆర్. నాయుడు మాట్లాడుతూ, "ఉద్యోగుల హక్కుల సాధన కోసం నిరాహార దీక్షలు కొనసాగుతాయ"న్నారు. డిపో కార్యదర్శి ముస్తాక్ అహ్మద్ మాట్లాడుతూ, "29వ తేదీన కూడా దీక్షలు కొనసాగుతాయని, అన్ని శాఖల ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొనాలి" అన్నారు. ఈ కార్యక్రమంలో డిపో సంయుక్త కార్యదర్శి ఎం.ఎం.డి. షరీఫ్, వర్కింగ్ అధ్యక్షుడు ఎన్.పీ.ఎం. సాహెబ్, ఉపాధ్యక్షులు కె.ఎం. సాహెబ్, ప్రచార కార్యదర్శులు బజారప్ప, ఎం.ఎల్. రెడ్డి, గ్యారేజ్ కార్యదర్శి భాస్కర్, ఎలక్ట్రిషన్ రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.



# జనసేన ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ తల్లి వర్ధంతి కార్యక్రమం

**ఏలూరు, ఏప్రిల్ 28 (జనస్వరం) :** తెలుగు ప్రజల హృదయాల్లో అపర అన్నపూర్ణమ్మగా చిరస్థాయిగా నిలిచిన డొక్కా సీతమ్మ తల్లి వర్ధంతిని పురస్కరించుకొని, ఏలూరు జనసేన పార్టీ కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ జోనల్ చైర్మన్, ఏలూరు నియోజకవర్గ జనసేన ఇంచార్జి రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ, "ఆకలితో వచ్చిన వారికి ఏనాడూ వద్దనకపోతూ, సుమారు 50 సంవత్సరాలు పేదలకు నిత్యం అన్నదానం చేసి అపర అన్నపూర్ణమ్మగా నిలిచిన సీతమ్మ తల్లి సేవలను స్మరిస్తూ, ఆమెకు శిరస్సువంచి వినమ్ర నివాళులు అర్పిస్తున్నాం," అని పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో, నిత్యసేవకులు, అయ్యప్ప స్వామి భక్తులు, జనసేన నాయకులు జగపతి మనోహరం స్వామి ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వేలాదిమందికి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా జగపతి స్వామి మాట్లాడుతూ, "ప్రతి సంవత్సరం డొక్కా సీతమ్మ తల్లి వర్ధంతిని ఘనంగా నిర్వహిస్తూ, మహా అన్నదాన కార్యక్రమం చేస్తూ వస్తున్నాం. ఈ ఏడాది కూడా జనసేన పార్టీ కార్యాలయంలో పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు అభిమాన కథానాయకుడు జగపతిబాబు ఆశీస్సులతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నాం" అని చెప్పారు. రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ, "భవన నిర్మాణ కార్మికులు, నిరుపేదలు, ఆకలితో వచ్చిన వారి ఆకలి తీర్చిన మహానియోగి సీతమ్మ తల్లి పేరును రాష్ట్రంలో ప్రభుత్వ పథకాలకు ఇవ్వాలన్న ఆలోచనపై రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ముందుకు సాగుతున్నారు" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీకి చెందిన వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు, జనసైనికులు, మెగా అభిమానులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పరిస్థితిని మరింత చక్కగా నిర్వహించినందుకు ప్రతి ఒక్కరికీ జనసేన పార్టీ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



# దేశంలోనే అత్యుత్తమ పాలసీగా ఏపీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ పాలసీ రూపొందిస్తాం

**- ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)**

**విజయవాడ, ఏప్రిల్ 28 (జనస్వరం) :** రాష్ట్రంలోని డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ పాలసీ దేశంలోనే అత్యుత్తమ పాలసీగా రూపొందించాలన్నది ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యమని, అందుకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా అధ్యయనం చేస్తూ ముందుకు సాగుతున్నామని డిఫెన్స్ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో సోమవారం విజయవాడలో హోటల్ వివాంతాలో నిర్వహించిన "మీట్ విత్ స్టేక్ హోల్డర్స్" సెమినార్‌లో ఎంపీ పాల్గొన్నారు. డిఫెన్స్, ఏరోస్పేస్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్, క్లస్టర్ల రూపకల్పనకు సంబంధించి ఈ కార్యక్రమం జరిగింది. ఈ సమావేశానికి డీఆర్డీఓ మాజీ చైర్మన్, ఏపీ ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ మ్యాన్యుఫ్యాక్చరింగ్ హబ్ గౌరవ సలహాదారుడు డా. జి. సతీశ్ రెడ్డి, ఇస్రో మాజీ చైర్మన్, ఏపీ స్పేస్ టెక్నాలజీ గౌరవ సలహాదారుడు ఎస్.పీ. సోమనాథ్, ఐ అండ్ సి అండ్ ఎఫ్.పి సెక్రటరీ ఎన్. యువరాజ్ (ఐఏఎస్), ఇండస్ట్రీస్ డైరెక్టర్ ఎమ్. అభిషిక్త్ కిషోర్ (ఐఏఎస్), జనరల్ ఆఫీసర్ కమాండింగ్ అజయ్ మిశ్రా తదితరులు హాజరయ్యారు. ప్రారంభంలో జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ, "ఏపీకి ఉన్న సముద్రతీర ప్రాంతాలు, రోడ్డు, రైలు, విమాన మార్గాలు, జల రవాణా సదుపాయాలు ఎంతో ఉపయోగపడతాయి. ఇవన్నీ రాష్ట్రాన్ని డిఫెన్స్ మరియు ఏరోస్పేస్ పరిశ్రమల కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అనుకూలంగా ఉన్నాయి," అన్నారు. ముఖ్యంగా ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో 'వికసిత్ భారత్' లక్ష్యంగా దేశంలో 100 శాతం రక్షణ ఉత్పత్తులను తయారుచేయడం కోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందించబడిందని, ప్రస్తుతం 61 శాతం ఉత్పత్తులు మాత్రమే దేశీయంగా తయారవుతున్నాయని, మిగిలిన వాటిని దేశంలోనే తయారు చేసేందుకు పెద్దఎత్తున కృషి చేస్తున్నామని తెలిపారు. స్వర్ణాంధ్ర ప్రదేశ్ 2047 దృష్ట్యా, సీఎం చంద్రబాబు డిఫెన్స్ పరిశ్రమలు, ఏరోస్పేస్ క్లస్టర్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. భవిష్యత్తులో క్వాంటం కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాలలో రాష్ట్రాన్ని ముందుండేలా చేయడానికి దృఢ సంకల్పంతో నడుస్తున్నారని పేర్కొన్నారు. ఈ సెమినార్‌కు దేశవ్యాప్తంగా ఉన్న 17 డిఫెన్స్ పబ్లిక్ సెక్టార్ సంస్థలలో 7 సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. మిగిలిన సంస్థలు తమ మద్దతు ప్రకటించాయని నిర్వాహకులు తెలిపారు. గోవా షిప్ యార్డ్, హిందూస్తాన్ షిప్ యార్డ్, హెచ్.ఎ.ఎల్ తదితర రక్షణ రంగ సంస్థల ప్రతినిధులు, హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం నుంచి ఇండస్ట్రియలిస్టులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వారు పాలసీ రూపకల్పనకు అమూల్యమైన సలహాలు, సూచనలు ఇచ్చారు.



# ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి మళ్లీ గెలవగలరా పల్లా?

**- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లాపై రగులుతున్న "తెలుగు శక్తి"**

**విశాఖపట్నం, ఏప్రిల్ 28 (జనస్వరం) :** తమపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు చేస్తున్న నిరాధార ఆరోపణలను ఖండిస్తూ, "తెలుగు శక్తి" సంస్థ అధ్యక్షుడు బి.వి.రామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం ఆయన వీ.జే.ఎఫ్ ప్రెస్ క్లబ్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బి.వి.రామ్ మాట్లాడుతూ, "పల్లా శ్రీనివాసరావు తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నాడు. నిజానికి ఎవరు వైఎస్సార్ కాంగ్రెస్ కోవర్ట్‌గా వ్యవహరిస్తున్నారో ప్రజలకు స్పష్టం చేయడానికి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి మళ్లీ గెలవాలని పల్లాకు సవాల్ చేస్తున్నాను. నేను కూడా నామినేషన్ వేసి, అమెరికాకు వెళ్తాను. అయినా గెలవగలడా?" అని ప్రశ్నించారు. తెలుగు శక్తి దండయాత్ర పల్లా శ్రీనివాసరావుపై "తెలుగు శక్తి" దండయాత్ర ప్రకటించింది. గత వైసీపీ పాలనలో పల్లా నిర్మిస్తున్న భవంతిని అధికారులు కూల్చివేసినప్పుడు ఉన్న ఉదాసీనతను, ఇప్పుడు గాజువాక ప్రాంతంలో గుడివాడ అమర్నాథ్ నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాన్ని కూల్చకుండా మౌనం వహించడం ఎందుకు అనే ప్రశ్నలు బి.వి.రామ్ లేవనెత్తారు.

**"తన స్వార్థం కోసం మౌనంగా ఉన్నాడు" :**

గతంలో గాజువాకలో సబ్బం హరి నివాసం, గీతం విశ్వవిద్యాలయ భాగం, పల్లా భవంతి వంటి నిర్మాణాలను వైసీపీ ప్రభుత్వం కూల్చివేసిందని గుర్తుచేశారు. అయినప్పటికీ ఇప్పుడు వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్న పల్లా శ్రీనివాసరావు స్వార్థపూరితమైన నిర్ణయాలు తీసుకుంటున్నారని విమర్శించారు. ఇటువంటి నాయకుడు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగడం సరైంది కాదని స్పష్టం చేశారు.

**తెలుగు శక్తి చర్యలు :**

తెలుగు శక్తి రాష్ట్ర వ్యాప్తంగా కోవర్టుల ఏరివేత కోసం రంగం సిద్ధం చేస్తోంది. ప్రతి జిల్లాలో కోఆర్డినేటర్లను నియమించి, టీడీపీ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా పనిచేసే వారిపై చర్యలు తీసుకుంటామని బి.వి.రామ్ తెలిపారు. వ్యాపారులపై బెదిరింపులు : ఈ సమావేశంలో చిన్ని వరలక్ష్మి అనే మహిళ మాట్లాడుతూ, మధురవాడలో 40 ఏళ్లుగా నిర్వహిస్తున్న తమ వ్యాపారంపై రమణాజీ అనే వ్యక్తి బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కార్పొరేటర్ పిల్లా మంగమ్మ భర్త వెంకటరావు వత్తాసు పలుకుతూ సెటిల్మెంట్ ఒత్తిడి తెస్తున్నారని తెలిపారు.



Owned by : Sake Naresh (Chairman) - 9642067900, Managed by : Jammu Sai Kalyan (Managing Director) - 7013030690, Mahendra (Sub editor) - 9866140211
REGD NO :APTEL 16144, Mail Id : janaswaramnews@gmail.com Dr.no : 9-35-4A, Illipilli Narasimha Rao Street, Opp KBN College, Kothapeta, Vijayawada - 520001.

# వైసీపీ పార్టీకి మనుగడ లేదు
# రైతును, తల్లిని మోసగించిన వై.ఎస్ జగన్

**పాలకొల్లు, ఏప్రియల్ 28 (జనస్వరం) :** రాష్ట్రంలో వైసీపీకి భవిష్యత్తులో మనుగడ ఉండదని, ఓట్లు అడిగే అర్హత కూడా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కోల్పోయిందని రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. సోమవారం పాలకొల్లు మండలం లంకల కోడేరు, వెంకటాపురం గ్రామాల్లో రూ.86 లక్షలతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు కూటమి నాయకులతో కలిసి మంత్రి ఆయన శంకుస్థాపన చేశారు. లంకలకోడేరు గ్రామంలో రూ.20 లక్షలతో కోడేరు నెంబర్ వన్ బ్రాంచ్ ఛానల్ పై, గ్రావెల్ రహదారి నిర్మాణ పనులు, ఇదే కాలువపై మరో రూ.9.99 లక్షలతో త్రవ్వకం పనులను మంత్రి రామానాయుడు ప్రారంభించారు. అదేవిధంగా వెంకటాపురంలో రాపాక ఛానల్ పై రూ. 41.50 లక్షలతో గ్రావెల్ రహదారి నిర్మాణ పనులను, ఇదే కాలువపై రూ.9.95 లక్షలతో త్రవ్వకం పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడుకు స్థానిక ప్రజల నుండి ఘన స్వాగతం లభించింది. రామానాయుడు మాట్లాడుతూ జగన్ కు 151 సీట్లు, 50 శాతం ఓట్లు వేసిన గత ఐదేళ్లలో రైతాంగానికి ఉపయోగపడే పంట కాలువలు, డ్రైన్ లలో కనీసం ఒక తట్ట మట్టి తీయలేదని, ఒక్కరూపాయి పని కి కూడా నోచుకోలేదనీ అన్నారు. రాష్ట్రంలో 80 శాతం వ్యవసాయంపైనే ఆధారపడి ఉన్నప్పటికీ రైతులకు ఎటువంటి మేలు చేయలేదన్నారు. జగన్ పార్టీ పెట్టుకొని ఎవర్ని ఉద్ధరించారో చెప్పాలన్నారు. రైతు, తల్లి కంట కన్నీళ్లు పెట్టించకూడదని ఆ





రెండిట్లోనూ జగన్ వైఫల్యం చెందాడని మంత్రి రామానాయుడు విమర్శించారు. గత టిడిపి ప్రభుత్వంలో పాలకొల్లు నియోజకవర్గంలో వంటకాలవలు డ్రైన్లు వెంబడి పెద్ద ఎత్తున గ్రావెల్ రహదారి నిర్మాణాలు చేపట్టామని, నేడు మళ్లీ కూటమి ప్రభుత్వంలో జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో అంగర చిన్న, సర్పంచ్ చొప్పల రజిని, సర్పంచ్ పెనుమత్స వివేక్ వర్మ, కోడి విజయభాస్కర్, నెక్కంటి అదినారాయణ, పెనుమత్స సత్యనారాయణ రాజు, ఆదూరి శ్రీనివాస్, పెన్మెత్స వెంకట సూర్యనారాయణ రాజు, కుడక కోటేశ్వరరావు, నెక్కంటి దుర్గారావు, వేగేశ్న వెంకట సూర్యనారాయణ రాజు, సరెళ్ళ ఓంకార్, చాగంటి అన్నవరం, ఆకుల బ్రహ్మాజీరావు, దమ్మ వెంకటేశ్వరరావు, డ్వాక్రా సిఏ లు, కలిదిండి వెంకట రామకృష్ణంరాజు, గోగీ శ్రీకాంత్, పరసా ఏడుకొండలు, గొట్టుముక్కల శివరామకృష్ణ ధన కోటేష్, పరసా వెంకటేశ్వర్లు, నక్కా కుటుంబరావు, పరసా నాగరాజు, దాసరి ఏడుకొండలు, గోట్టు ముక్కల సూర్యనారాయణ రాజు, పెనుమత్స రామలింగరాజు, కలిదిండి భాస్కర్ రాజు, ఇంటి శ్రీరాముడు, అందెకోటి వీరభద్రం, పణతుల సూరిబాబు, మద్దు సత్యనారాయణ, కె.వి నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

# వచ్చే వర్షాకాలంలోగా దమయపర్తి డ్రైన్ పనులు పూర్తి
# పనులను పరిశీలించిన మంత్రి రామానాయుడు

**పాలకొల్లు, ఏప్రియల్ 28 (జనస్వరం) :** వచ్చే వర్షాకాలానికి ముందుగానే దమయపర్తి డ్రైన్ పనులు పూర్తిచేయాలనే లక్ష్యం పెట్టుకున్నామని, ఆ దిశగా పనులను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు తెలిపారు. పాలకొల్లు పట్టణంలో కొత్త మంచినీటి చెరువు ప్రాంతంలో రూ 14 కోట్లతో జరుగుతున్న దమయపర్తి మురుగు డ్రైన్ పనులను ఆయన పరిశీలించారు. సంబంధిత డ్రైనేజీ శాఖ అధికారుల నుంచి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ దీర్ఘకాలికంగా వర్షాకాలంలో 15 వార్డులకు ఎదురవుతున్న ముంపు సమస్యకు త్వరలో మోక్షం కలగబోతుందన్నారు. దమయపర్తి డ్రైన్ పనులు పూర్తయితే ఇక ముంపు సమస్య శాశ్వతంగా ఉండదన్నారు. ఈ పనులు చేపట్టేందుకు ఊబి ప్రదేశంలో చాలా కష్టమని ఏజెన్సీలు ముందుకు రాకపోవడంతో బ్రతిమలాడి పనులు ముందుకెళ్లేలా అది కూడా ఇరిగేషన్ పెద్ద వర్క్ లు చేసే ఏజెన్సీలకు అప్పగించామని మంత్రి రామానాయుడు తెలిపారు. పనులు వేగవంతంగా జరగడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ డ్రైన్



వెంబడి నివాస గృహాలు ఉన్నందువలన రాకపోకలకు రహదారి నిర్మాణం చేపడుతున్నట్లు మంత్రి రామానాయుడు చెప్పారు. ఈ కార్యక్రమంలో నూతనంగా ఎంపిక కాబడ్డ ఏఎంసీ చైర్మన్ కోడి విజయభాస్కర్, ధనాన్ని శ్రీరామమూర్తి, బోనం చినబాబు, కామిశెట్టి జయరాం, దేవ గానుగుల వరలక్ష్మి, జక్కంపూడి కుమార్, కొల్లి కొండ ప్రసాద్, బిరుదుకోట శేఖర్, పొట్నూరి శ్రీనివాస్, బేరం శ్రీరామచంద్రమూర్తి, జిత్తుగా వెంకటేశ్వరరావు, బత్తుల కృష్ణ, షేక్ షీలార్, గంధం సుబ్బారావు, పొట్నూరి రమేష్, బిట్ట లక్ష్మీనారాయణ, విన్నకోట గోపి తదితరులు పాల్గొన్నారు.





# సిఎం గారూ! అమరావతి భజన తగ్గించుకొని శాంతి భద్రతలపై దృష్టి పెట్టండి
## - డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి

**పులివెందుల ఏప్రిల్ 28 (జనస్వరం) :** రాష్ట్రంలో శాంతి భద్రతలు అధ్వాన్నంగా తయారయ్యాయని రాజ్య సభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్ తులసి రెడ్డి విరుచుకు పడ్డారు . సోమవారం వేంపల్లి లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రం లో శాంతి భద్రతలు నానాటికీ తీసికట్టు నాగం భట్లు అన్నట్లు తయారయ్యాయన్నారు. ఆడవాళ్ళకు, మగ వాళ్లకు, హిజ్రాలకు ఎవ్వరికీ రక్షణ లేదన్నారు. వేట కొడవళ్ళు వీరవిహారం చేస్తున్నాయ్. మద్యం, డ్రగ్స్, గంజాయి, జూదం, బెట్టింగులు విచ్చలవిడిగా సాగుచున్నాయన్నారు. నిన్న ఆదివారం పట్టపగలు కర్నూల్ జిల్లా, ఆలూరు అసెంబ్లీ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కర్త,మాజీ జెడ్ పి టి సి సభ్యులు చిప్పగిరీ లక్ష్మి నారాయణను టిప్పర్ తో డీ కొట్టి వేట కొడవళ్ళతో నరికి చంపారన్నారు. ఏప్రిల్ 22 న ప్రకాశం జిల్లా, నాగులుప్పలపాడు మండలం, అమ్మనబ్రోలుకు చెందిన టిడిపి నేత వీరయ్య చౌదరిని ప్రత్యర్థులు చంపారని తెలిపారు.11-3-2025 న విజయనగరం జిల్లా లో దేవి అనే ఒక ఎస్ ఐని ఒక యువకుడు మద్యం మత్తులో జుట్టు పట్టుకొని లాగాడన్నారు. 8-2-2025 న ప్రకాశం జిల్లా దొనకొండ మండలం,ఇండ్ల చెరువు గ్రామం లో మద్యం మత్తులో మరియ దాస్ తన తండ్రి యేసును రంపం తో కోసి చంపాడన్నారు. 24-1-2025 న ఆలూరు మండలం,అరికెర గ్రామం లో ఫీల్డ్ అసిస్టెంట్ ఈరన్నను కండ్లల్లో కారం చల్లి వేట కొడవళ్ళతో నరికి చంపారని తెలిపారు. 6-1-2025 న పులివెందుల నియోజకవర్గం, తొండూరు మండలం, తుమ్మల పల్లి గ్రామానికి చెందిన గంగాధర్ రెడ్డి మద్యం మత్తులో భార్య శ్రీలక్ష్మిని ,కుమార్తె గంగోత్రిని నరికి చంపాడన్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే కొండవీటి చాంతాడు అవుతుందన్నారు. నేర చరిత్ర గల ఎమ్మెల్యే లలో ఆంధ్ర ప్రదేశ్ నెంబర్ 1 స్థానం లో ఉంది.79 శాతం మంది ఎమ్మెల్యే లకు నేర చరిత్ర ఉందన్నారు.



పరిస్థితి ఇలా వుంటే అంతా బాగుంది, స్వర్ణాంధ్ర, సంతోష ఆంధ్ర, సంపద ఆంధ్ర అంటూ ముఖ్య మంత్రి డైలాగులు చెబుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా డైలాగులు మానుకొని, అమరావతి భజన తగ్గించుకొని శాంతి భద్రతల మీద దృష్టి సారించాలని తులసి రెడ్డి సూచించారు. లక్ష్మి నారాయణను చంపిన వారిని పట్టుకొని చట్టపరంగా శిక్షించాలని తులసి రెడ్డి డిమాండ్ చేశారు.

# ఫిర్యాదు దారులకు చట్టపరిధిలో న్యాయం చేయండి
## - ఎస్పీ అశోక్ కుమార్

**పులివెందుల, ఏప్రిల్ 28 (జనస్వరం) :** "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక"కు వచ్చిన 175 పిటీషన్ల (PGRS)కు సంబంధించి, ఫిర్యాదు దారులకు చట్ట పరంగా న్యాయం చేయాలని జిల్లా ఎస్పి ఇ.జి. అశోక్ కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక" (Public Grievances Redressal System) కార్యక్రమాన్ని నిర్వహించారు.



ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి విచ్చేసిన ప్రజలతో ఎస్పి ముఖాముఖి మాట్లాడి, వారి సమస్యలపై అక్కడికక్కడే సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులకు పోలీసు సిబ్బంది ప్రశాంత వాతావరణంలో తమ సమస్యలు వివరించేందుకు సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో ఎ.ఆర్. డీఎస్పీ కె. శ్రీనివాసరావు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# డిమాండ్ల సాధన కోసం ఎన్ఎంయూఏ నిరాహార దీక్షలు

**పులివెందుల ఏప్రిల్ 28 (జనస్వరం) :** పులివెందుల ఏపీఎస్ఆర్టీసీ డిపో కార్యాలయం ఎదుట సోమవారం డిమాండ్ల వాసన కోసం ఎన్ఎంయుఏ ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు చేపట్టారు. ఎన్ ఎమ్ యు ఏ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మొదటి రోజు సోమవారం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పి.యస్.యన్.రావు, డిపో చైర్మన్ రమణ, సిసిఎస్ డెలిగేట్ రామలింగారెడ్డి, రీజినల్ కమిటీ మెంబర్ ఈశ్వరయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ యమ్ యమ్ రెడ్డి, డిపో యూనియన్ కమిటీలోని సభ్యుల ఆధ్వర్యంలో ఈ దీక్షలు చేపట్టారు. ఈ సందర్బంగా వారి డిమాండ్లని వివరించారు. ఉద్యోగుల ఉద్యోగ భద్రతా సర్క్యులర్ 1/2019 అన్ని డిపోలలో వెంటనే అమలు చేయాలి. ఈటి అక్రమ సస్పెన్షన్స్, రిమూవల్సు ఆపాలి- గత నాలుగు 4 సంవత్సరాలుగా ఆగిపోయిన ప్రమోషన్లను వెంటనే ఇవ్వాలి, మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీ.వో. ప్రకారం పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలి ఎల్ ఈ హెచ్ స్థానంలో పాత వైద్య విధానాన్ని కొనసాగించాలి, ఆర్టీసీ లో మాదిరిగానే క్యాడర్ స్ట్రెంత్ అమలు చేయాలి, 114 జి.వో. లో పొందు పరచిన మేరకు నైట్ అవుట్ అలవెన్సును 150 రూ॥ల నుండి 400 రూ॥లకు పెంచాలి, ఎలక్ట్రికల్ బస్సులను ప్రభుత్వము లేదా సంస్థ ద్వారా మాత్రమే కొనాలి, అనారోగ్యంతో భాద పడుతున్న ఉద్యోగులకు ఓ. డీ. లను కేటాయించాలి- ఉద్యోగుల అనారోగ్య సెలవులకు పూర్తి జీతం చెల్లించాలి. గ్యారేజి ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలి.



యు ఎస్ డబుల్ డ్యూటీల అమౌంటును పెంచాలి, ఐ ఈ ఎస్ నాన్ ఆపరేషన్ ఉద్యోగుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలి, ఆఫీస్ సిబ్బంది దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలి. ఎమ్ ఎస్ పారదర్శకమైన ట్రాన్స్ఫర్ పాలసీని అమలు చేయాలి, ఉద్యోగుల అవసరాన్ని బట్టి ఈ వో ఎల్ మంజూరు చేయాలి, రిటైర్డ్ ఉద్యోగుల దంపతులకు సూపర్ లగ్జరీ బస్సులో ప్రయాణాలను అనుమతించాలి, యు ఎస్ ఆన్కాల్ డ్రైవర్ సమస్యలను పరిష్కరించాలి, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు సంస్థ పరంగా జీతాలు చెల్లించాలి, డిస్టేషన్లను యధావిధిగా కొనసాగించాలి.. తమ న్యాయపారమైన డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

# వైసీపీ మాజీ ఎమ్మెల్యే విష్ణు విమర్శలు హాస్యాస్పదం

**పులివెందుల ఏప్రిల్ 28 (జనస్వరం) :** కూటమి ప్రభుత్వం లో బ్రాహ్మణులు పై ప్రభుత్వ దాస్టికమ్. పెరిగింది అని వైసీపీమాజీ ఎం ల్ ఏ మల్లాది విష్ణు విమర్శించడం హాస్యాస్పదం అని బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర ఆర్గనైసింగ్ సెక్రటరీ ప్రసాదరావుఒక ప్రకటన లో ఖండించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ గతం లో కూడా పూజారుల పై దేవస్థానం ఛైర్మెన్ లు దాడి చేసారాని బ్రాహ్మణ సంఘాలు కేసులు పెట్టిన అతి గతి లేదని ఆనాడు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. వివాదస్పద కేసు లో అరెస్ట్ అయిన పోలీస్ అధికారి బ్రాహ్మణుడు కావడం యాద్రుచ్చిక మని అరెస్ట్ చేయడం పోలీస్ కేసు లో భాగమని ఆయనకు ఏమి ఇవ్వాలో కోర్ట్ ఆదేశాలు వుంటాయని అన్ని తెలిసి ఆరోపించడం కేవలం బురద చల్లడానికే అని అన్నారు. గతంలో శ్రీలక్ష్మి కేసు లో ఈ సానుభూతి ఏమైందని ప్రశ్నిoచ్చారు.అధికారులు పై ప్రభుత్వo కచ్చ సాధింపు ఐబీ విషయం లో చుశా మని అన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మెన్ గా బ్రాహ్మణులకు ఎంత మేలు జరిగిందో అందరికి తెలుసుని ఛైర్మెన్ గా ఉండి ప్రభుత్వ ఆదేశాలు పాటించక పోవడం కరెక్టా అని ప్రశ్నించారు. ఇక శారదా పీఠం పై ఎవరికీ పెద్దగా మంచి అభిప్రాయం లేదని దాని గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదని అన్నారు. తిరుమల కొండ పై అనేక అక్రమాలు జరిగిన గతంలో ఎందుకు స్పందించ లేదన్నారు?.గత ప్రభుత్వం లో బ్రాహ్మణ కార్పొరేషన్ బీసీ శాఖ లో కలపడం దారుణం కాదా అన్నారు. మీరు చైర్మన్ గా వున్నపుడే కార్పొరేషన్ పథకాలు అటేకెక్కలేదా? ఎంతమంది బ్రాహ్మణ లకు పథకాలు అందలేదో మీకు తెలియదా అని ప్రశ్నించారు. ఇక శారదా పీఠం పై ఎవరికీ పెద్దగా మంచి అభిప్రాయం లేదని దాని గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదని అన్నారు. తిరుమల కొండ పై అనేక అక్రమాలు జరిగిన గతంలో ఎందుకు స్పందించ లేదన్నారు?.గత ప్రభుత్వం లో బ్రాహ్మణ కార్పొరేషన్ బీసీ శాఖ లో కలపడం దారుణం కాదా అన్నారు.మీరు చైర్మన్ గా వున్నపుడే కార్పొరేషన్ పథకాలు అటేకెక్కలేదా? ఎంతమంది బ్రాహ్మణ లకు పథకాలు అందలేదో మీకు తెలియదా అని ప్రశ్నించారు.



# ప్రధాన మంత్రి మోదీ సభ విజయానికి సిద్ధం ప్రజలు : ఎంపీ కేశినేని శివనాథ్

**విజయవాడ, ఏప్రిల్ 28 (జనస్వరం) :** అమరావతి రాజధాని పునర్నిర్మాణానికి శంకుస్థాపన చేయడానికి రాష్ట్రానికి విచ్చేయనున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సభను ప్రజలు స్వచ్ఛందంగా విజయవంతం చేయాలని సిద్ధమై ఉన్నారని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) పేర్కొన్నారు. సోమవారం భవానీపురంలోని సంస్కృతి ఫంక్షన్ హాల్లో టీడీపీ పశ్చిమ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం అధ్యక్షత వహించిన ఈ సమావేశానికి ప్రత్యేక పరిశీలకుడిగా ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు హాజరయ్యారు. సభ ఆరంభంలో తెలుగుదేశం వ్యవస్థాపకులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పశ్చిమ నియోజకవర్గ అభిజాత్య పరిశీలకుడు చిట్టబత్తుని శ్రీనివాసరావు, ప్రధాని మోదీకి అద్భుత స్వాగతం పలికి, అమరావతిలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని తీర్మానం ప్రవేశపెట్టగా, సభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

**ప్రజలతో స్వచ్ఛందంగా 60 వేల మంది హాజరు :**

ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ, "ప్రధాని మోదీ రాష్ట్రానికి అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపేందుకు ప్రజలు స్వచ్ఛదంగా తరలిరావడానికి సిద్ధమయ్యారు. పశ్చిమ నియోజకవర్గం నుంచి 60 వేల మంది హాజరయ్యేందుకు సమగ్ర ఏర్పాట్లు చేపట్టాం," అని వెల్లడించారు. అమరావతి నిర్మాణం పూర్తవాలని ప్రజల ఆకాంక్షను మోదీ సమక్షంలో తెలియజేయాలని, కేంద్ర - రాష్ట్రాల్లో ఎన్డీయే డబుల్ ఇంజన్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్ర అభివృద్ధికి మోదీ అనేక విధాలుగా మద్దతు ఇస్తున్నారని తెలిపారు. రాజధాని లేక రాష్ట్ర ప్రజలు ఎదుర్కొన్న సమస్యలను ప్రధాని మోదీ స్పష్టంగా గమనించారని, అందుకే అమరావతి నిర్మాణానికి రూ.15 వేల కోట్ల గ్రాంట్ మంజూరు చేశారని తెలిపారు.

**మోదీతో రాష్ట్ర భవిష్యత్తుకు దిశానిర్దేశం :**

నెట్టెం రఘురామరాజు మాట్లాడుతూ, "దేశంలో ఉగ్రదాడులు, యుద్ధ పరిస్థితులు నెలకొన్న వేళ కూడా రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రధాని మోదీ వచ్చి అమరావతి పునర్నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారని" అన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలు చూపిన ఉత్సాహాన్ని ఇప్పుడు మోదీ రాక సందర్భంగా మరింత ఉత్సాహంగా కొనసాగించాలని పిలుపునిచ్చారు.

**కొందరు ప్రముఖుల హాజరు :**

ఈ సమావేశంలో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, రాష్ట్ర అధికార ప్రతినిధులు నాగుల్ మీరా, సయ్యద్ రఫీ, ఆర్యవైశ్య వెల్ఫేర్ & కార్పొరేషన్ డెవలప్మెంట్ చైర్మన్ డూండీ రాకేష్, మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ ఫతావుల్లా, రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి ఎమ్.ఎస్.బేగ్, డివిజన్ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

